సాక్షి మంచిర్యాల

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



మంచిర్యాలలోని బస్టాండ్ ఈద్గా వద్ద సందేశమిస్తున్న మత పెద్ద ముఫ్తి ఇక్రముల్ హక్



చిన్నారుల ఆలింగనం





మంచిర్యాల బస్టాండ్ సమీపంలోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నెల రోజులపాటు నియమ నిష్టలతో కఠిన ఉపవాసం ఆచరించగా.. సోమవారం విరమించారు. ఉదయం నుంచే ఈద్గా, మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంచిర్యాల బస్టాండ్ వద్ద ఈద్గాతోపాటు అండాళమ్మ కాలనీ(క్వారీ రోడ్డు) ఈద్గా, మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. పండుగ వేళ ఈద్గా వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈద్గా, మసీదుల వద్ద చిరువ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాల్లో ఆటవస్తువుల కొనుగోలుకు చిన్నారులు ఆసక్తి చూపారు. మంచిర్యాలలో ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, నాయకులు వేర్వేరుగా ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రామకృష్ణాపూర్: ఆర్‌కేపీలో ప్రార్థనల్లో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



శుభాకాంక్షలు తెలుపుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



కోటపల్లి: ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

న్యూస్‌రీల్

ఎంజేపీ సెట్ దరఖాస్తు గడువు పెంపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించే ఎంజేపీ బ్యాక్‌లాగ్ సెట్‌కు దరఖాస్తు గడువును ఈ నెల 6వరకు పొడగించినట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వరకు దరఖాస్తు గడువు ఉండగా.. పొడగించారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,832 బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు ఉండగా మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్, సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని, హాల్ టికెట్లను ఏప్రిల్ 15నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు https://mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో కానీ 040-23328266 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఏషియన్ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

భీమారం: ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన ఉస్కమల్ల కళ్యాణ్ ప్రతిభ చాటాడు.



కళ్యాణ్

మార్చి 28 నుంచి 30వరకు కాంబోడియా రాజధాని పీనంపెన్‌లో జరిగిన మొదటి ఏసియన్ పారా త్రోబాల్ పోటీల్లో ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ పోటీల్లో ఎనిమిది దేశాలు పాల్గొనగా అందులో ఇండియా మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. భారతజట్టులో ఆరెపల్లి గ్రామానికి చెందిన కళ్యాణ్ ప్రతిభ చాటాడు. కాగా, డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో కాంబోడియాల్లో జరిగిన సిట్టింగ్ పారా త్రోబాల్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న కళ్యాణ్ అత్యుత్తమ ప్రతిభతో బంగారు పతకం సాధించాడు. కళ్యాణ్‌ను డీసీసీ నాయకుడు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, క్రీడాభిమానులు అభినందించారు.

జిల్లా ఉపాధి కల్పన అధికారిపై చీటింగ్ కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ.రవికృష్ణపై చీటింగ్ కేసు నమోదైంది. మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మందమర్రికి చెందిన నోముల రాజేందర్‌గౌడ్ 2024 ఏప్రిల్ 10న జిల్లాలో ఎన్ని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఉన్నాయి, ఎన్ని ఏజెన్సీలకు కేటాయించారు, 2024-25లో ఎన్ని ఏజెన్సీలు ఎంప్యానెల్‌కు సెలక్షన్ చేశారని 21అంశాలపై వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా కలెక్టర్‌కు దరఖాస్తు చేశాడు. ఈ సమాచారం ఇవ్వాలని కలెక్టర్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ.రవికృష్ణకు పంపించారు. ఈ సమాచారానికి 10,034 పేజీలు అవుతుందని, పేజీకి రూ.2.50చొప్పున రూ.25,085 చెల్లిస్తే వివరాలు ఇస్తానని రవికృష్ణ 2024 జూలై 7న రాజేందర్‌గౌడ్‌కు లేఖ రాశారు. దీంతో అతడు అదే నెలలో డబ్బును డీడీ ద్వారా చెల్లించాడు. అయినా సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేయడం, కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడంతో రాజేందర్‌గౌడ్ జిల్లా సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు రవికృష్ణపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇక్కడ డ్యూటీ చేయలేం..!



గత నెల 29న బస్టాండ్ వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో దాడి సమయంలో గుమిగూడిన జనం

- పోలీసు అధికారుల అనాసక్తి
- లూప్‌లైన్‌లోకి వెళ్లేందుకైనా సిద్ధమే..

మంచిర్యాలక్రైం: ఆ పోలీసుస్టేషన్‌లో ఖాకీ కొలువు కత్తిమీద సాములా మారింది. అటు పోలీసు ఉన్నతాధికారులు.. ఇటు రాజకీయ నాయకుల ఒత్తిడి మధ్య నలిగిపోవాల్సి వస్తోంది. పోలీసుశాఖలో బదిలీల సందర్భంలో నచ్చిన చోట పోస్టింగ్ కోసం పోలీసులు రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటారు. జిల్లాలో డిమాండ్ ఉన్న పోలీసుస్టేషన్లలో ఎస్‌హెచ్‌వో పోస్టింగ్ కోసం రూ.లక్షలు వెచ్చించడానికైనా విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల కనుసన్నల్లో 'మామూలు'గా పని చేసుకుంటారు. పోలీసు శాఖలో ఇది సర్వసాధారణమే అయినా దీనికి భిన్నంగా జిల్లాలోని ఓ పోలీసుస్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పని చేయాలంటే దమ్ము, ధైర్యం, అధికార బలం ఉండాల్సిందే. ఇక్కడికి వచ్చేందుకు ఎంతైనా ఖర్చు చేసి రావడానికి ఉత్సాహం చూపిస్తారు. విధుల్లో చేరి ఓ ఆరు నెలలు గడిచాక శాంతిభద్రతల పరిరక్షణ, రాజకీయ నాయకుల ఒత్తిడితో ఇక్కడ విధి నిర్వహణ కత్తి మీద సాములా మారుతుంది. ఎందుకు వచ్చామా.. అనుకుంటూ మళ్లీ రూ.లక్షలు వెచ్చించి బదిలీపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. శాంతిభద్రతలను అదుపులో ఉంచడంలో పోలీసుశాఖలో నిజాయతీ అధికారిగా పేరున్న ఓ అధికారి 2024 ఫిబ్రవరిలో ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టారు. నెల రోజులకే ఇక్కడ పని చేయాలేనంటూ ఉన్నతాధికారులకు పరిస్థితి వివరించి బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆరోగ్య సమస్య అంటూ బదిలీపై వెళ్లిపోయారు. ఆయన తర్వాత బాధ్యతలు చేపట్టిన అధికారి ఒక వర్గానికే మద్దతు ఇవ్వడంతో అధికారులు బదిలీ వేటు వేశారు. ఓ అధికారి సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇక్కడ పని చేయడం కష్టమేనని బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏడాది కాలంలో ముగ్గురు అధి కారులు మారారు. ప్రస్తుతం పని చేస్తున్న ఓ అధికా రితోపాటు మరో అధికారి సైతం ఎలాగైనా ఇక్కడి నుంచి మరోచోటికి వెళ్లేందుకైనా, లూప్‌లైన్‌లో విధులు నిర్వర్తించడానికైనా సిద్ధమేనంటూ ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకున్నట్లు సమాచారం.

అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

జిల్లాలో జరిగిన కొన్ని దాడుల కేసుల్లో తీవ్రంగా పరిగణిస్తుండగా.. మరికొన్ని కేసుల్లో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిడా.. 'మామూలు'గా వ్యవహరిస్తున్నారా అనేది చర్చనీయాంశంగా మారింది. కొన్ని కేసుల్లో దాడులకు పాల్పడిన వారిపై కాకుండా గాయపడిన వారిపై కేసులు నమోదు చేయడం, ఒకవేళ ఇరువర్గాలపై కేసులు చేయాల్సి వస్తే గాయపడిన వారిపై నాన్‌బెయిలేబుల్ కేసులు, దాడి చేసిన వారిపై స్టేషన్ బెయిల్ కేసులు నమోదు చేసి చేతులు దులిపేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలోని శివాజీ గ్రౌండ్‌లో రౌడీషీటర్‌పై జరిగిన దాడిలో ఇప్పటికీ నిందితులను గుర్తించకపోవడం, పైగా గాయపడిన వ్యక్తి ఫిర్యాదు చేయలేదని పోలీసులు చేతులెత్తేయడం గమనార్హం.

పోలీసులకు సవాల్

జిల్లాలో ఏడాదిగా గ్యాంగ్‌ల అలజడి కొనసాగుతోంది. గ్యాంగు దాడులను అరికట్టేందుకు పోలీసులు సంచలనాత్మక నిర్ణయాలు తీసుకోవడం, కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. కొందరు కేసులనూ లెక్క చేయకుండా చిన్న చిన్న గొడవలు పెద్దగా చేసి అలజడి రేపుతున్నారు. గొడవ జరిగిన ప్రతీసారి వారం రోజులు పోలీసులు తీవ్రంగా పరిగణించడం, రాత్రి పది గంటలకే లాఠీ ఝులిపించడం, హోటళ్లు, పాన్‌షాపులు బంద్ చేయించడం ఆనవాయితీగా మారింది. ఆ తర్వాత మళ్లీ మామూలుగానే మారుతోంది. గత నెల 10న జిల్లా కేంద్రంలోని శివాజీ గ్రౌండ్‌లో రౌడీషీటర్ ఎర్రగుంటపల్లి సంపత్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి, 29న రాత్రి 12గంటలకు హమాలీవాడ వద్ద ఓ నలుగురు వ్యక్తులు ఛాయ్ హోటల్ యువకుడిపై దాడి ఘటనలు సంచలనం సృష్టించాయి. జిల్లాలో గత ఏడాదిలోనూ ఇలాంటి దాడులు, ప్రతిదాడులు జరిగాయి. వినాయక నిమజ్జనంలో కత్తులతో కొట్లాట, మాధవి బార్ ముందు హాకీ, బేస్‌బాల్ స్టిక్స్‌తో గొడవ, బీఆర్‌ఎస్ నాయకుడు గడప రాకేష్‌పై దాడి, బైపాస్ రోడ్డులో రెండు గ్యాంగుల మధ్య గొడవ, సద్దుల బతుకమ్మ పండుగ రోజు నాలుగు చోట్ల గ్యాంగుల అలజడి, బైపాస్ రోడ్డు చేపల మార్కెట్ వద్ద బీజేపీ నాయకుడిపై దాడి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఘటనలే ఉన్నాయి. దాడులను అరికట్టడం పోలీసులకు సవాల్‌గా మారాయి.

యువ వికాసానికి అడ్డంకులు

- ధ్రువపత్రాల జారీలో జాప్యం
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ అర్జీదారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ యువ వికాసం పథకానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. గడవు తేదీ సమీపిస్తున్న తరుణంలో ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ నెల 5లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, మరుసటి రోజు నుంచే జిల్లాస్థాయి కమిటీ అర్హుల ఎంపికను ప్రారంభిస్తుంది. వరుస సెలవులకు తోడు ఆన్‌లైన్‌లోనూ సర్వర్ బిజీతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్‌తోపాటు రోజువారీగా రిజిస్ట్రేషన్లు, భూ సంబంధిత వ్యవహారాల్లో రెవెన్యూ అధికారులు తీరిక లేకుండా ఉన్నారు. కొత్తగా పత్రాల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు.

ధ్రువపత్రాల కోసం తిప్పలు

ప్రభుత్వం యువవికాసం పథకంలో రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు సబ్సిడీతో యూనిట్లు మంజూరు చేయనుంది. ఇందులో పలు రంగాల యూనిట్లకు ఎంపిక కావాలంటే గ్రామీణుల ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణాల్లో రూ.2లక్షలు మించకూడదు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి, దరఖాస్తుకు రేషన్‌కార్డు జతపర్చాలి. రేషన్‌కార్డు లేకపోతే ఆదాయ పత్రం సమర్పించాలి. అంతేగాక రాష్ట్ర ఏర్పాటు తర్వాత తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం జతపర్చాలి. ప్రతీ దరఖాస్తుదారుడు ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ, కుల, డ్రైవింగ్ సర్టిఫికేట్లు, పట్టాదారు పాసు పుస్తకం, సదరం, ప్రత్యేక వర్గాల కోసం మండల కమిటీ నిర్ధారించిన ధ్రువీకరణ పత్రాలు అవసరం అవుతున్నాయి. దీంతో యువతీ, యువకులు దరఖాస్తుల కోసం తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒక్కో ధ్రువపత్రానికి మూడు నుంచి వారం రోజుల సమయం పడుతోంది. మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దారు కార్యాలయాల్లో పరిశీలించి, జారీ చేయాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో ఇప్పటికే రెవెన్యూ కార్యాలయాల్లో రెవెన్యూ ధ్రువీకరణ పత్రాల కోసం సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించారు. కొన్ని చోట్ల త్వరితగతిన అందుతున్నా మరికొన్ని చోట్ల జాప్యం జరుగుతోంది. ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయొద్దని ఆదేశాలు ఉన్నాయి. ఒకేసారి అధిక సంఖ్యలో అర్జీలు ఇవ్వడంతో ఆలస్యం అవుతోంది.

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం రూ.19.06 కోట్లు



మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుదారులు

మంచిర్యాలటౌన్: ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులకు సోమవారం చివరి రోజు కావడంతో భారీ సంఖ్యలో చెల్లించి సద్వినియోగం చేసుకున్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో అప్పటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 55,697 మంది దరఖాస్తు చేసుకోగా.. ఇందులో 31,093మంది దరఖాస్తులు ఎల్ఎస్ఎస్ ఫీజుకు ఆమోదం పొందాయి. మార్చి 31వరకు చెల్లించిన వారికే 25శాతం రాయితీ ప్రకటించగా.. రంజాన్ పండుగ రోజు కూడా జిల్లా వ్యాప్తంగా 924మంది ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ.2.27కోట్లు చెల్లించారు. 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోని వారికి నేరుగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించగా 243మంది సద్వినియోగం చేసుకున్నారు. మొత్తంగా 7,408 దరఖాస్తులకు సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ద్వారా రూ.19.06 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం లభించింది.

పెరిగిన టోల్ చార్జీలు

- ఎన్‌హెచ్-363పై రూ.5నుంచి రూ.20వరకు పెంపు
- అర్ధరాత్రి నుంచే మందమర్రి, సరండి వద్ద అమలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆర్థిక సంవత్సరం ముగియడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు పెరగనున్నాయి. జాతీయ, రాష్ట్రీయ రహదారుల్లో కొన్ని చోట్ల పెరిగే అవకాశం ఉండగా, మరి కొన్ని చోట్ల తగ్గే అవకాశం ఉంది. మంచిర్యాల నుంచి చంద్రాపూర్ వెళ్లే జాతీయ రహదారి-363పై చార్జీలు పెరగనున్నాయి. ఈ జాతీయ రహదారి మహారాష్ట్ర సరిహద్దు వరకు మొత్తం 94కిలోమీటర్లు ఉండగా, మంచిర్యాల జిల్లా మందమర్రి, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఈ రెండు చోట్ల పెరిగిన ధరలు వచ్చే ఏడాది మార్చి 31వరకు అమల్లో ఉంటాయి. ఇక్కడి ట్రాఫిక్, నిర్వహణ తదితరవన్నీ లెక్కగట్టి ఎన్‌హెచ్ అధికారులు పెంపు రుసుం కోసం ప్రతిపాదనలు పంపగా, ఆమోదించారు. గతేడాదితో పోలిస్తే కనీసం రూ.10నుంచి రూ.20వరకు పెరిగాయి.

మందమర్రి టోల్‌ప్లాజాలో కొత్త ధరలు(రూ.లలో)

వాహనం	ఒకవైపు	రెండువైపుల	లోకల్ కమర్షియల్	నెలవారీ పాస్
ఫోర్‌వీలర్	90	135	45	3050
తేలిక/గూడ్స్ మినీ వాహనాలు	150	220	75	4930
బస్సు/ట్రక్కు	310	465	155	10,330
3జతల టైర్ల వాహనాలు	340	505	170	11,270
4-6జతల టైర్ల వాహనాలు	485	730	245	16,200
భారీ వాహనాలు (7జతల టైర్లపైన)	590	885	295	19,720

ఆన్‌లైన్‌లో పేరున్నా సన్న బియ్యం

- నేటి నుంచి పంపిణీకి ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్తగా రేషన్‌కార్డులు మంజూరై పౌరసరఫరాల శాఖ పోర్టల్‌లో పేర్లు ఉన్న వారికి కూడా సన్న బియ్యం పంపిణీకి పౌరసరఫరాల శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో నూతనంగా కార్డులు జారీ కాకున్నా పోర్టల్‌లో పేర్లు ఉన్న వారికి సైతం సన్న బియ్యం అందనున్నాయి. ఉగాది రోజున సీఎం రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోనూ ఆ మేరకు పంపిణీకి పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో కొత్త కార్డులు మంజూరైనా గ్రామసభల్లో అర్హుల జాబితా వెల్లడి సమయంలో తలెత్తిన సమస్యలతో ఇంకా లబ్ధిదారులకు ఇవ్వలేదు. తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడ్డాయి. మరోవైపు మీ సేవల్లో కొత్త కార్డుల మార్పులు, చేర్పుల కోసం ఇంకా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఇక సన్న బియ్యం ఇప్పటికే రేషన్ దుకాణాలకు ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి మొత్తం కోటాలో కనీసం 50శాతం వరకు సరఫరా చేశారు. ప్రతినెలా బియ్యం రవాణాలో అనేక చోట్ల జాప్యం జరుగుతున్నా ఈసారి అలా జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. తొలిసారిగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు రేషన్ దుకాణాల వద్ద హాజరు కానున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

రేషన్ దుకాణాలు	1712
రేషన్ కార్డులు	7.59లక్షలు
లబ్ధిదారులు	24.12లక్షలు
కొత్త రేషన్ కార్డుల అర్జీలు 1.55లక్షలు(ప్రజాపాలనలో వచ్చినవి)	
కొత్తగా మంజూరైనవి	72,276

పన్ను వసూళ్లలో పదో స్థానం

- జిల్లాలో ఇంటిపన్నులు 91శాతం వసూలు
- ప్రథమ స్థానంలో జైపూర్, కన్నెపల్లి మండలాలు
- చివరన జన్నారం మండలం



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యసాధనకు పంచాయతీ అధికారులు చేపట్టిన ప్రత్యేక చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. ఇప్పటివరకు 91శాతం పన్నులు వసూలయ్యాయి. దీంతో జిల్లా రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచింది. మిగతా 9శాతం పన్నులు వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఇంటి పన్నులు, వాణిజ్య పన్నులు, మంచినీటి కులాయి బిల్లులు వసూలు చేశారు. జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్నులు, ఇతర పన్నుల ద్వారా రూ.6 కోట్ల 70లక్షల 81వేలు వసూలు చేయాలనే లక్ష్యంలో భాగంగా మార్చి 31వరకు రూ.6కోట్ల 9లక్షల 8వేలు వసూలు చేశారు. ఇంకా రూ.61.73లక్షలు వసూలు చేయాల్సి ఉంది. రానున్న ఆర్థిక సంవత్సరానికి జీరో శాతంతో ఉంటామని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

అన్ని మండలాల్లో 90శాతంపైగానే..

జిల్లాలోని 16 మండలాల్లో జైపూర్, కన్నెపల్లి మండలాలు 96శాతం పన్ను వసూళ్లతో మొదటి స్థానంలో నిలిచాయి. జన్నారం 86శాతం వసూళ్లతో చివరి స్థానంలో ఉంది. భీమారం, కోటపల్లి లక్సెట్టిపేట మండలాలు 94శాతం, భీమిని, కాసిపేట మండలాలు 93శాతం, హాజీపూర్, నెన్నెల 92శాతం, బెల్లంపల్లి, దండేపల్లి, వేమనపల్లి మండలాలు 91శాతం, చెన్నూర్ 90శాతం, మందమర్రి 89శాతం, తాండూర్ 87శాతం పన్నులు వసూళ్లు చేశాయి.

క్లుప్తంగా

ప్రమాదపుటంచున విధులు



ట్రాలీపై నిలబడి మరమ్మతు చేస్తున్న సురేందర్

కడెం: భరోసా లేని ఉద్యోగం ..అయినా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రమాదపు టంచుల్లో విధులు నిర్వహిస్తూ నిరంతరం వెలుగులు పంచేందుకు శ్రమిస్తున్నారు విద్యుత్‌శాఖ అన్‌మ్యాన్డ్ వర్కర్స్...ఈ చిత్రంలో మనం చూస్తున్నది కడెం మండలంలోని నవబ్ పేట్ వద్ద అన్‌మ్యాన్డ్ వర్కర్ గొర్ల సురేందర్. విధుల్లో భాగంగా ఇలా ట్రాక్టర్ ట్రాలీపై ప్రమాదకరంగా నిలబడి 11 కేవీలైన్ మరమ్మతు చేస్తున్నాడు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అన్‌మ్యాన్డ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ర్యాలి గ్రామానికి చెందిన ఆత్రం భీము (62) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్సై వినిత తెలిపారు. గ్రామానికి చెందిన మేకల కాపరి భీము సోమవారం మేకలు కాసేందుకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత ఊర్లోకి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ శివారులోకి వెళ్లి చూడగా కొలాంగూడకు వెళ్లే మార్గంలో రోడ్డుపక్కన తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని కుమారుడు ఆత్రం చిన్ను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు..



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పెంబి: మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన ఆత్రం నాగోరావు (37) సోమవారం ఉదయం మందపల్లి గ్రామ శివారులో గల తన మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ చేసే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో అతని సోదరుడు చేనుకు వెళ్లి చూడగా చనిపోయి ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతునికి భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బోల్సాలో ఇల్లు దగ్ధం

తానూరు: మండలంలోని బోల్సాలో చెందిన బండి పోతన్నకు చెందిన పెంకుటిల్లు సోమవారం పాక్షికంగా దగ్ధమైంది. పోతన్న కుటుంబ సభ్యులు ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో గ్రామస్తులు గమనించి తలుపులను తొలగించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దుస్తులతో పాటు నిత్యావసరాలు కాలిపోయినట్లు తెలిపారు.

అప్పు కట్టినా..‘రుణం’ తీరలే!



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఆసంపల్లి రాజలింగు. మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామానికి చెందిన ఇతను మందమర్రిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 2021లో రూ.70 వేల రుణం తీసుకున్నాడు. రుణం మాఫీ కావాలంటే వడ్డీ చెల్లించాలని బ్యాంకు అధికారులు చెప్పడంతో రూ.31వేలు కట్టాడు. ప్రభుత్వం నాలుగు విడతల్లో రైతుల రుణాలు మాఫీ చేసినా ఈ రైతు రుణం మాత్రం మాఫీ కాలేదు. కుటుంబంలో తానొక్కడినే పంటరుణం తీసుకున్నానని, అధికారులకు అన్నిపత్రాలు సమర్పించానని, అయినా తనరుణం ఎందుకు మాఫీ కావడం లేదని ఆందోళన చెందుతున్నాడు. ఇతనొక్కడే కాదు జిల్లాలో పలువురు రైతులదీ ఇదే పరిస్థితి.



తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట బారులు తీరిన రైతులు (ఫైల్)

- ఆరు నెలలుగా ఎదురు చూసినా నిరాశే..
- రూ. 2 లక్షల పైబడి రుణాలు ఉన్న రైతులకు మొండిచేయి
- జిల్లాలో 29 వేల మంది వరకు మాఫీ లేనట్లే..

జిల్లాలో రైతులు తీసుకున్న రుణాలు, మాఫీ వివరాలు

విడతలు	రైతులు	(మాఫీ రూ.ల్లో)
మొదటి	29,127	153,43,69,814
రెండవ	14,680	141,95,12,055
మూడవ	13,244	176,74,42,650
నాలుగవ	8,195	78,59,43,066
మొత్తం	65,176	550,72,67,585

మంచిర్యాలఅగ్రికల్చర్: 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ 9 వరకు జిల్లాలో 94,200 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంటరుణం తీసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 65,176 మంది రైతులకు పంట రుణ మాఫీ జరిగింది. రూ.2 లక్షల లోపు, ఆపైన రుణాలు తీసుకుని అన్ని అర్హతలు ఉండి మాఫీకాని రైతులు జిల్లాలో 29 వేల మంది వరకు ఉన్నారు. చివరి నాలుగో విడత జాబితాలో కేవలం కొంతమంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరింది. అన్ని అర్హతలు ఉండి అధికారులు సైతం వివరాలు నమోదు చేసుకున్నా మాఫీ కాకపోవడానికి గల కారణాలను తెలవడం లేదని రైతులు వాపోతున్నారు. పలుమార్లు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అర్హత ఉన్నా తమకు ఎందుకు రుణమాఫీ కావడంలేదో అధికారులు చెప్పడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెండు లక్షలలోపు రుణం ఉన్న రైతులతో పాటు ఆపైన రుణం తీసుకున్న రైతులు వడ్డీలు చెల్లించి ఆరునెలలుగా మాఫీకోసం ఎదురు చూస్తున్నారు. రెండు లక్షల వరకు ఉన్న అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకెందుకు మాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీకి నిబంధనలు లేవంటూనే ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతూ మాఫీ చేయకుండా నీరుగార్చిందని రైతులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో 29 వేల మంది వరకు..

2018 డిసెంబర్ 12 నుంచి 2022 డిసెంబర్ 9 వరకు రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ వర్తించేలా ప్రభుత్వం కట్ ఆఫ్ డేట్ విధించింది. జిల్లాలో ఈ గడువులోగా వివిధ బ్యాంకుల ద్వారా రుణం తీసుకున్న రైతులు 94,200 మంది వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రూ.1,258 కోట్ల మేర పంట రుణాలు తీసుకున్నారు. రుణమాఫీ ప్రక్రియలో భాగంగా జులై 16 నుంచి ఆగస్టు 15 వరకు మూడు విడతల్లో రుణమాఫీ అమలు చేసింది. ఆ తర్వాత డిసెంబర్‌లో నాలుగో విడుత రుణమాఫీ నిధులు విడుదల చేసింది. మొత్తం నాలుగు విడుతల్లో 65,176 మంది రైతులకుగానూ రూ.550,72,67,585 మాఫీ జరిగింది. కుటుంబ నిర్ధారణ కానివారు, ఆధార్ కార్డులో తప్పులున్నవారు, పంట రుణం తీసుకున్న ఖాతాపై ఒకపేరు, ఆధార్‌కార్డుపై మరోపేరు ఉన్న రైతులు, భర్త, భార్య పేరిట భూమి ఉండి ఇద్దరి పేరుతో రూ.2 లక్షలపైన తీసుకున్న రుణాలు, సరైన వివరాలు తేలని రైతుల పంట రుణాలు మాఫీ కాలేదు. నాలుగు విడతల్లో కూడా రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసి తమ రుణం మాఫీ కాలేదని మొర పెట్టుకుంటున్నారు. పలుమార్లు వ్యవసాయ అధికారులకు, బ్యాంకర్లకు, గ్రీవెన్స్‌లలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని, తమ సమస్య పరిష్కారం కావడంలేదని వాపోతున్నారు.

రుణమాఫీ కాలే.. రైతుభరోసా రాలే..



తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నా పేరు మీద, నా భార్య పేరు మీద రూ.2లక్షల 15 వేల పంటరుణం తీసుకున్నా. ఐదు నెలల క్రితమే రూ.15 వేలు చెల్లించిన. ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణాలు మాఫీ చేసింది. కానీ నాకు మాత్రం మాఫీ కాలేదు.

– జాపాతి రాజన్న, నెన్నెల

మాఫీ లేదు..సాయం లేదు..



మా కుటుంబంలో నేనొక్కడినే తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల పంటరుణం తీసుకున్నా. నాకు రేషన్‌కార్డు కూడా ఉంది. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకంలో అన్నీ కరక్టుగానే ఉన్నాయి. అయినా నాకు రుణమాఫీ కాలేదు. చెన్నూర్ ఏవో ఆఫీసులో, కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు చేసినా. ఇటు రుణమాఫీ కాలేదు. అటు పంట పెట్టుబడి సాయం అందలేదు..అప్పులు చేసి ఈయేడు పంటలు వేసుకున్నా.

– కస్తూరి మల్లయ్య, పొన్నారం, చెన్నూర్

అర్హులకు మాఫీ అయ్యింది..



రెండు లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ అయ్యాయి. నాలుగు విడతల్లో జిల్లాలో మొత్తం 65,176 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. రూ.2 లక్షలకు పైన ఉన్న రైతుల రుణాల మాఫీకి సంబంధించి మాకు ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు.

– కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

పద్యాలాపనలో రాష్ట్రస్థాయి పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న లింబగిరిస్వామి

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి తిరునగరి లింబగిరి స్వామి రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలోని సూర్యాపేటలో ఇటీవల మూడు రోజులపాటు క్రీడా సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న లింబగిరి స్వామి తనదైన శైలిలో పద్యాల పోటీలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు.

డ్రాగన్ తోట దగ్ధం



దగ్ధమైన డ్రాగన్ తోట

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లింగోజి తాండ సమీపంలో ఉన్న డ్రాగన్ తోట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు జాదవ్‌రాజు నాలుగు ఎకరాల్లో డ్రాగన్ తోటను సాగు చేస్తున్నారు. ఆదివారం బంధువు ఒకరు మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లాడు. తోటకు మంటలు ఎలా అంటుకున్నాయో అంతు పట్టడం లేదన్నాడు. ఈ ప్రమాదంలో రూ.12 లక్షల నష్టం వచ్చిందని రైతు వాపోయాడు. సోమవారం మాజీ సర్పంచ్ జాదవ్ హరినాయక్ తోటను పరిశీలించారు.

గ్రూప్‌-1లో 434వ ర్యాంక్



తల్లి నిర్మలాదేవితో వైద్యసాయి వివేక్‌నాథ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీలో నివాసం ఉంటున్న నిర్మలాదేవి, వైద్య రవీంద్రనాథ్ దంపతుల చిన్న కుమారుడు వైద్య సాయి వివేక్‌నాథ్ ఇటీవల ప్రకటించిన గ్రూప్‌-1 ఫలితాల్లో 434వ ర్యాంక్ సాధించాడు. బెంగళూరులో పోస్టల్ అసిస్టెంట్‌గా చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేరయ్యాడు. తల్లి భీమిని మండలం వీగాం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తండ్రి లక్సెట్టిపేట్ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగానే మృతి చెందాడు. తండ్రి ఆశయాల మేరకు చదువులో రాణిస్తూ ఎన్ఐటీ నాగ్‌పూర్‌లో బీటెక్ చదివాడు. సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్స్ కంప్లీట్ చేశాడు. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ప్రిపేరయ్యాడు. బీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు, ఓవరాల్‌గా 434వ ర్యాంకు సాధించాడు.

సింగరేణి ఉద్యోగికి 552వ ర్యాంకు



తల్లిదండ్రులతో క్రాంతి

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన దుర్గం క్రాంతి ఏరియాలోని శాంతిఖని గనిలో ఓవర్ మెన్‌గా ఉద్యోగం చేస్తూనే గ్రూప్‌-1కు ప్రిపేరయ్యాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో 452.5 మార్కులతో 552వ ర్యాంకు సాధించాడు. దుర్గం రమేశ్, సుజాత దంపతుల కుమారుడైన క్రాంతి పదోతరగతి వరకు స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో చదివాడు. గూడూరులో 2012 నుంచి 2015 వరకు మైనింగ్ డిప్లొమా చేశాడు. 2016లో సింగరేణిలో నోటిఫికేషన్ వెలువడగా పరీక్షకు హాజరై ఓవర్‌మెన్ ఉద్యోగం సాధించాడు. విధులు నిర్వహిస్తూనే అంబేద్కర్ యూనివర్సిటీలో బీఏ, కాకతీయ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేశాడు. ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ వన్ పరీక్షలో ప్రతిభ కనబర్చాడు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



మంటల్లో కాలుతున్న ఇల్లు

తిర్యాణి: మండలంలోని మొర్రిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల లోయ గ్రామంలో టేకం జంగుకు చెందిన ఇల్లు ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఇంట్లో దేవుళ్ల చిత్రపటాల వద్ద దీపం వెలిగించారు. ప్రమాదవశాత్తు ఇంట్లోని వివిధ వస్తువులకు అంటుకుని మంటలు చెలరేగడంతో ఇల్లు దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. తహసీల్దార్ సూర్యప్రకాష్ ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేశారు. నష్టం అంచనా వేసి ప్రభుత్వం నుండి ఆర్థికసాయం అందజేస్తామని, ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

తాంసి: మద్యానికి బానిసై ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలంలోని నిపానిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నీలగిరి నాగన్న (33) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి కూడా భార్యతో గొడవపడి పుట్టింటికి పంపించేశాడు. రాత్రి మద్యం మత్తులో ఇంట్లో దులానికి ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై ముంతాజ్ తెలిపారు.

ఎస్‌ఆర్‌ఆర్ నగర్‌లో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌ఆర్ కాలనీలో చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సింగరేణి ఉద్యోగి తొగరి రాధాకృష్ణ గతనెల 29న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. 30న సాయంత్రం స్థానిక మహిళ ఫోన్‌చేసి మీ వెనుక డోర్ తెరిచి ఉందని, కోతులు ఇంట్లోకి వెళ్లాయని చెప్పింది. దీంతో రాధాకృష్ణ ఇంటి పక్కనున్న శంకర్‌కు ఫోన్ చేసి చెప్పగా ఇంటితాళం పగులగొట్టి ఉందని, బీరువా లాకర్ కూడా తెరిచి ఉందన్నాడు. వెంటనే రాధాకృష్ణ సోమవారం ఇంటికి వచ్చి చూడగా లాకర్‌లో దాచి ఉంచిన 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి పోయినట్లు గుర్తించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పశువుల షెడ్డు దగ్ధం

తానూరు: మండలంలోని బోంద్రట్‌లో సురేశ్ పటేల్‌కు చెందిన పశువుల షెడ్డు సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులకు సమీపంలోని విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగలడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి షెడ్డులో ఉన్న పశుగ్రాసంతో పాటు వ్యవసాయ పనిముట్లు దగ్ధమయ్యాయి. గమనించిన గ్రామస్తులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బందివచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనలో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని వాపోయారు. ఆర్ఐ మోహన్‌సింగ్ షెడ్డును పరిశీలించి పంచనామా నిర్వహించారు.

చోరీ కేసులో పురోగతి

- అపహరణకు గురైన నాలుగు బైక్‌లు స్వాధీనం
- నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాల అన్వేషణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో గత శనివారం తెల్లవారు జామున రెండిళ్లలో చోరీ జరిగిన కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు తీవ్రతరం చేశారు. సాన శ్రావణ్, అత్తె సుధాకర్ ఇళ్లలో చొరబడి 19.1/2 తులాల బంగారం , కిలోన్నర వెండి, రూ.90 నగదుతోపాటు శ్రీనివాస్, రమేశ్, చంద్రశేఖర్, శ్రావణ్ ఇళ్ల ముందు పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. సదరు మోటారు సైకిళ్లను రెండు రోజుల క్రితం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాల్‌టెక్స్ ఏరియాలో ఓ చోట ఉన్న సీసీ కెమెరాలో నిందితులు మంచిర్యాల వైపు వెళ్లినట్లు ధ్రువీకరించుకుని గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ వద్ద 1, ఓ సినిమా థియేటర్ వద్ద మరో మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో పోలీసులు ఓ ముందడుగు వేశారు.

నిందితులు స్థానికేతరులే(నా)..?

చోరీకి పాల్పడిన నిందితులు ఎవరనేది ఇంతవరకూ తేలలేదు. చోరీ చేసిన విధానం, బైక్‌లను పట్టుకెళ్లి గోదావరిఖనిలో వదేసి పరారైన తీరుతెన్నుల గురించి పోలీసు అధికారులు నిశితంగా ఆరా తీస్తున్నారు. గత ఫిబ్రవరి 7న బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం వెంకటస్వామికి చెందిన రూ.4.40 లక్షలు పట్టపగలు మోటారు సైకిల్ కవర్‌లో నుంచి ఎంతో చాకచక్యంగా అపహరించుకు వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు , ప్రస్తుతం రెండిళ్లలో చోరీ చేసిన నిందితులు, అంతకు ముందు బెల్లంపల్లి బజారు ఏరియాలోని నాలుగు షాపుల్లో చోరీ చేసిన అగంతకులు అంతా కూడా స్థానికేతరులై ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులు పట్టుబడితే కానీ ఎక్కడి వారనేది స్పష్టమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఏదిఏమైనా ఇటీవల చోటు చేసుకున్న చోరీ సంఘటన బెల్లంపల్లి ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తోంది.

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షలో స్టేట్‌ఫస్ట్



నస్పూరి వెంకటేశ్వర్

ఖానాపూర్: సైనిక్ స్కూల్‌లో ఆరోతరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 23న నిర్వహించిన పరీక్షలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి చెందిన నస్పూరి వెంకటేశ్వర్ రాష్ట్రస్థాయిలో ఫస్ట్‌ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన గంగామణి, సంతోశ్ దంపతుల కుమారుడు వెంకటేశ్వర్ కడెం మండలంలోని లింగాపూర్‌లో గల శాంతినికేతన్ పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. గ్రామస్తులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

3న పండ్ల తోటలకు వేలం

ఉట్నూర్‌రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా ఉద్యాన నర్సరీ మామిడితోటలకు ఏప్రిల్ 3న వేలం వేయనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటలో బంగినపల్లి, దసేరీ, తోతాపరి, రసాలు, హిమాయత్ లాంగ్ర వంటి మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయన్నారు. 2025 నుంచి 2027 పంట కాలానికి కలిపి ఈ పండ్ల తోటల వేలం జరుగుతున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు రూ.10 వేల ధరావత్ సొమ్ముతో ఏప్రిల్ 3న ఉదయం 11గంటలకు జంబుగా ఉద్యాన నర్సరీ లో జరిగే వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 8897478825 సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రం నుండి తుంగెడకు వెళ్తున్న ఆటో బోల్తాపడటంతో ముగ్గురికి తీవ్ర, నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. జుమ్మిడి శ్రీనివాస్ తన ఆటోలో సోమవారం రెబ్బెన నుండి తుంగెడకు ప్రయాణికులతో బయలుదేరాడు. మార్గమధ్యలో ముందు టైర్ పేలడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న తుంగెడకు చెందిన జుమ్మిడి రవీందర్, జుమ్మిడి లచ్చుంబాయి, జుమ్మిడి రాజుబాయిలకు తీవ్రంగా జుమ్మిడి సంతోష్, జుమ్మిడి శ్యాంరావ్, జుమ్మిడి విజయలక్ష్మి, జుమ్మిడి శ్రీనివాస్‌లకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను రెబ్బెన పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం బెల్లంపల్లికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

వాగాయితండాకు చేరిన పాదయాత్ర



వాగాయితండాకు చేరిన స్వాములు

ఇంద్రవెల్లి: నార్నూర్ మండలంలోని కొత్తపల్లి దీక్ష భూమి నుంచి ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న చేపట్టిన ఉమ్మడి జిల్లా సేవాలాల్ దీక్ష స్వాముల పాదయాత్ర సోమవారం సాయంత్రం ఇంద్రవెల్లి మండలంలోని వాగాయితండా గ్రామానికి చేరుకుంది. సుమారు నాలుగు వేలమంది స్వాములకు ఈశ్వర్‌నగర్, వాగాయితాండ గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాత్రి వాగాయితాండలో విశ్రాంతి తీసుకున్న స్వాములు మంగళవారం తెల్లవారు జామున పాదయాత్రగా బయలుదేరి ఏప్రిల్ 6న మహారాష్ట్రలోని పోరదేవి చేరుకొని శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొంటామని వారు తెలిపారు.

బంజారా దీక్షభూమి చేరిన శోభాయాత్ర



శోభయాత్రను ప్రారంభిస్తున్న దీక్ష గురువు

నార్నూర్: సేవాలాల్ మహారాజ్ దీక్ష చేపట్టిన భక్తులతో మండలంలోని కొత్తపల్లి హెచ్ జాతీయ బంజారా దీక్ష భూమి సోమవారం జనసంద్రమైంది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి సేవాలాల్ భక్తులు వేలాది సంఖ్యలో దీక్ష భూమికి తరలివచ్చారు. శ్రీరామనవమి రోజున మహారాష్ట్రలోని పొరదేవి పుణ్యక్షేత్రానికి వెళ్లి జగదంబ దేవి, శ్రీ సంత్ రామారావు మహారాజ్ దర్శనం అనంతరం మాల ధరించిన భక్తులు దీక్షలు విరమిస్తారు. జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద శోభాయాత్రను దీక్ష గురువు శ్రీ ప్రేమ్ సింగ్ మహారాజ్ ప్రారంభించారు. పాదయాత్ర మహారాష్ట్రలోని పొరదేవి పుణ్యక్షేత్రానికి శ్రీరామనవమి రోజున చేరుకుంటుందని దీక్ష గురువు తెలిపారు.


ప్రజలు భయాందోళన చెందవద్దు



అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న అధికారి

తాంసి: భీంపూర్ మండలంలోని రాజ్‌ఘడ్ శివారులో ఉన్న అటవీ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ఎక్కడ చిరుతపులి సంచరించినట్లు ఆనవాళ్లు లేవని, ప్రజలు భయాందోళనకు గురికావద్దని ఫారెస్ట్ సెక్షన్ అధికారి మోపత్‌రావు అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన రైతు తుకారాం పంటచేలకు వెళ్లే క్రమంలో అటవీ ప్రాంతంలో రైతుపై చిరుతపులి దాడిచేసి గాయపర్చినట్లు గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు తెలిపారు. సోమవారం అధికారులు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామస్తులతో కలిసి రైతుపై దాడిచేసిన స్థలాన్ని పరిశీలించారు. చిరుతపులి సంచరించినట్లు ఆనవాళ్లు లేవని నిర్ధారించారు. రైతుపై అటవీ జంతువు ఏదైనా దాడి చేసి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. రైతులు చేలకు వెళ్లేటప్పుడు చప్పుడు చేస్తూ వెళ్లాలని సూచించారు. వారి వెంట బీట్ అధికారి సాయి కుమార్, గోపాల్, సిబ్బంది కృష్ణ, సోనేరావు ఉన్నారు.

కళతప్పిన అడవులు



మల్యాల బీట్‌లో మోడువారిన అడవులు

జన్నారం: పచ్చదనంతో పర్యాటకులకు ఆహ్లాదం పంచుతున్న అడవులు కళ తప్పాయి. వేసవికాలంలో చెట్ల ఆకులు రాలిపోవడంతో అడవి మొత్తం కళావిహీనంగా మారింది. జన్నారం అటవీ డివిజన్‌లోని మల్యాల వాచ్ టవర్ ఎక్కి చూస్తే అడవి మొత్తం మోడువారి కనిపించింది. ఈ దృశ్యాన్ని అటవీ అధికారులు కెమెరాల్లో బంధించారు.